సాక్షి
నారాయణపేట
ఆదివారం । 21 । మే । 2023



రక్తమోడిన రహదారులు
ఉమ్మడి జిల్లాలో చోటుచేసుకున్న వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం చెందారు.
వివరాలు 8లో ▸



బీచుపల్లి.. జనసంద్రం
బీచుపల్లి పుణ్యక్షేత్రం వివిధ ప్రాంతాల భక్తులతో జనసంద్రంగా మారింది.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
41.4 /28.2
రోజంతా ఎండతీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెడుతుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమయ్యే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఓటర్లు డోర్ నంబర్ అప్‌డేట్ చేసుకోండి

నారాయణపేట: జిల్లాలో ఒకటి **కంటే ఎక్కువ** ఇళ్లు లేదా అపార్ట్‌మెంట్‌లో ఒకే ఇంటి నంబర్‌పై వేర్వేరు కుటుంబాల్లో నివసిస్తున్న ఓటర్లు ఆయా డోర్ నంబర్లను అప్‌డేట్ చేసుకొని ఓటును నిర్ధారించుకోవాలని కలెక్టర్, ఎన్నికల అధికారి కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మల్టిపుల్ పోర్షన్స్ కలిగిన ఇళ్లు, అపార్ట్‌మెంట్‌లలో ఒకే ఇంటి నంబర్లపై వేర్వేరు కుటుంబాలు ఓటర్లుగా నమోదు అయితే ప్రతి ప్లాట్ లేదా పోర్షన్లలో ఉంటున్న కుటుంబానికి ఒకే డోర్ నంబర్ అప్‌డేట్ చేసుకోవాలని తెలిపారు. ఇందుకు మీ సమీపంలోని బూత్‌స్థాయి అధికారి, మండల అధికారులు, మున్సిపల్ అధికారులను సంప్రదించి ఫారం –8 ఉపయోగించి సరైన అడ్రస్, డోర్ నంబర్లు సరి చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

మద్యం అక్రమ రవాణాపై చర్యలు

నారాయణపేట: జిల్లాలో మద్యం అక్రమ రవాణా అడ్డుకట్టకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం సాయంత్రం ఎస్పీ కార్యాలయంలో ఎక్సైజ్ పోలీస్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే మద్యానికి తెలంగాణ మద్యానికి గల తేడాను ఎస్పీకి వివరించారు. కర్ణాటక, హర్యానా, గోవా రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా తెలంగాణలోకి తరలిస్తున్నారని తెలిపారు. అక్కడ తక్కువ ధరకు కొని, తెలంగాణలో ఎక్కువ ధరకు అమ్మడం వల్ల రాష్ట్ర ఆదాయం పడిపోతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు సమన్వయంతో విధులు నిర్వర్తించి అక్రమ మద్యానికి అడ్డుకట్ట వేయాలని సూచించారు. జలాల్‌పూర్, ఎక్లాస్‌పూర్, దామరగిద్దలోని కానుకుర్తి, క్రిష్ణ దగ్గర టైరోడ్డు చెక్‌పోస్టుల వద్ద పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు సమన్వయంతో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మహబూబ్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, డీఎస్పీ కె.సత్యనారాయణ, జిల్లా టాస్క్ ఫోర్స్ ఇన్‌చార్జ్ నర్సిరెడ్డి, ఎస్‌ఐ సీఐ నర్సిరెడ్డి, ఎస్‌ఐలు శ్రీనివాసులు, సందీప్‌రెడ్డి ఉన్నారు.

అందింది 49 శాతమే..



పాఠ్యపుస్తకాల లోడ్‌తో నారాయణపేటకు వచ్చిన కార్గో వాహనం

జిల్లాకు చేరిన పాఠ్యపుస్తకాలు
- బడులు తెరిచేనాటికి అందించేందుకు విద్యాశాఖ చర్యలు
- ఈ ఏడాది రాత పుస్తకాల పంపిణీకి శ్రీకారం

నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించేందుకు పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరాయి. ఏటా విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత ఆరు నెలలు గడిచినా పూర్తిస్థాయిలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించని పరిస్థితి ఉండేది. ఈసారి మాత్రం అందుకు భిన్నంగా విద్యాశాఖ అధికారులు ముందస్తుగా పుస్తకాలను తెప్పించారు. కానీ 49శాతం మాత్రమే ఇప్పటి వరకు జిల్లాకు చేరాయి. పాఠశాలలు తెరిచిన తొలి రోజే చిన్నారులకు పాఠ్యపుస్తకాలను అందించాలనే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఆంగ్ల మాధ్యమ పుస్తకాల కొరత ఎంతో ఇబ్బందికి గురి చేసింది. ఈసారి దాన్ని అధిగమించడానికి కృషి చేస్తున్నారు. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి అవసరమైన పుస్తకాల సంఖ్యను ముందుగానే గుర్తించి అందుకు తగ్గట్లు 10శాతం ఎక్కువ చొప్పున గత విద్యా సంవత్సరం మధ్యలోనే ముద్రణ ప్రారంభించారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని స్టాక్ పాయింట్‌కు సగానికిపైగా పుస్తకాలు డంప్ చేశారు.

ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు..

జిల్లాలో తెలుగు మాధ్యమంతో పాటు ఇంగ్లిష్, ఉర్దూ, కన్నడ మీడియం పాఠశాలలు ఉండటంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆయా పాఠశాలలకు సరిగ్గా పుస్తకాలు అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం జిల్లా గోదాంలో డంప్ చేసిన వాటిని ఎమ్మార్సీలు, క్లస్టర్ పాయింట్లకు వాటిని జూన్ 1లోపు చేరుస్తారు. అక్కడి నుంచి సంబంధిత హెచ్‌ఎంలు వారివారి పాఠశాలల సంఖ్య ఆధారంగా పాఠ్యపుస్తకాలను తీసుకుని వెళ్తారు. గతంలో 1 నుంచి 8వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలోని పాఠశాలలకు రెండు భాషల్లో పుస్తకాలను ముద్రించి పంపిణీ చేశారు. దీంతో ముద్రణ ఆలస్యం కావడంతో పాత పుస్తకాలతో సర్దుకున్నారు. ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా పుస్తకాల పంపిణీకి సిద్ధం చేశారు.

పుస్తకాలు త్వరగా అందిస్తాం..



గతంలో రెండు భాషల్లో ముద్రణకు ఆలస్యం కావడంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తాయి. ఈసారి అలాంటి సమస్య లేకుండా ముందస్తుగా జిల్లా గోదాంకు 49శాతం పుస్తకాలు 9 కార్గో బస్సుల్లో వచ్చాయి. మరో వారం రోజుల్లో మిగితావి రానున్నాయి. జూన్ 1లోపు ఎమ్మార్సీలు, క్లస్టర్ పాయింట్‌కు పంపి అక్కడి నుంచి స్కూళ్లకు అందిస్తాం. రాత పుస్తకాలు సైతం త్వరలో రానున్నాయి.
– యాదయ్యశెట్టి, టెక్ట్స్ బుక్స్ జిల్లా ఇన్‌చార్జ్

రాత పుస్తకాలు సైతం..

ఈ విద్యా సంవత్సరం నూతనంగా పాఠ్యపుస్తలతో పాటు రాత పుస్తకాలను (నోట్స్)ను అందిస్తుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వాటి ముద్రణ సైతం ప్రారంభమైంది. పేపర్ రేట్లు అమాంతం పెరగడంతో బీద, మధ్య తరగతి కుటుంబాలు వారి పిల్లలకు నోట్‌బుక్కులు కొనిచ్చే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో వాటిని సైతం ఉచితంగా అందించాలనే లక్ష్యంతో కొత్తగా శ్రీకారం చుట్టారు. జూన్‌లో పాఠశాలలు తెరిచే నాటికి వాటిని సైతం సిద్ధం చేసి అందించేందుకు ప్రణాళిక ప్రకారం సాగుతున్నారు.

పుస్తకాలు గోదాంలో..

జిల్లా వ్యాప్తంగా 513 ప్రభుత్వ, 11 కేజీబీవీ, 6 గురుకుల, మూడు ఎయిడెడ్ పాఠశాలల్లో కలిపి 72,493 విద్యార్థులు ఉన్నారు. వీరికి 3,96,459 పుస్తకాలు అవసరమని అధికారులు నివేదిక అందించారు. అయితే వాటిలో 3369 పాత పుస్తకాలు ఉండగా 3,93,090 పుస్తకాలు కొత్తవి రావాల్సి ఉంది. వీటిలో మొదటి విడత కింద తొమ్మిది కార్గో బస్సుల ద్వారా 1,90,790 పుస్తకాలు రాగా వాటిని జిల్లా కేంద్రంలోని సింగార్‌బేస్ స్కూల్ గోదాంలో నిల్వ చేశారు. మరో 2,02,300 పుస్తకాలు రావాల్సి ఉంది. మొత్తంగా ఇప్పటివరకు జిల్లాకు 49శాతం పుస్తకాలు అందినట్లు అధికారిక లెక్కలు చెప్తున్నాయి.



జిల్లా బుక్స్ పాయింట్‌ను పరిశీలిస్తున్న డీఈఓ

హైవేలతో అనుసంధానం



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మహబూబ్‌నగర్ ఎంపీ, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి తదితరులు

- రూ.1,400 కోట్లతో డబ్లింగ్‌లైన్ ఏర్పాటు
- మహబూబ్‌నగర్ స్టేషన్‌లో ఉచిత వైఫై సేవలు
- కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి

పాలమూరు/స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి పాలమూరు జిల్లాను జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తామని కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో మహబూబ్‌నగర్– విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైలును రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మహబూబ్‌నగర్– విశాఖపట్నం రైలును ప్రారంభిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. మహబూబ్‌నగర్‌తో పాటు చుట్టు ప్రాంతాల ప్రజలు ఈ రైలు ద్వారా కాచిగూడ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, అన్నవరం, తుని ప్రాంతాలకు వెళ్లవచ్చన్నారు. నెల రోజుల క్రితం రూ.1,400 కోట్లతో మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్ వరకు డబ్లింగ్‌లైన్‌ను పూర్తి చేసి ఇటీవలే ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. రూ.720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను ఎయిర్‌పోర్ట్ మాదిరిగా తీర్చిదిద్దుతామన్నారు. సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌ను స్టేషన్‌లో ఆపేలా రైల్వేశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. చెంగల్‌పట్టు– కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌ను షాద్‌నగర్‌లో నిలిపేలా సంబంధిత అధికారులతో మాట్లాడుతానన్నారు.

మన్యంకొండకు నిధులు కేటాయించాలి
కేంద్ర పర్యాటక శాఖ నుంచి మన్యంకొండ ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఇటీవలరైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేసుకున్న దేవరకద్ర గేటు, జిల్లాకేంద్రంలోని వీరన్నపేట గేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. రైల్వే స్టేషన్‌కు ఎదురుగా ఉన్న న్యూమోతీనగర్ ప్రజలు రైల్వేట్రాక్ దాటి కాలనీకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి పైపులైన్, రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి రైల్వే అధికారులు అడ్డుపడుతున్నారని, ఆయా సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దేవరకద్రలో రైల్వేగేటు మూసివేయడం వల్ల ఏర్పడిన ఇబ్బందులను పరిష్కరించాలని, అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు.

సౌకర్యాలు మెరుగుపరుస్తాం..

మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో ఉచిత వైఫై సేవలు కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు. వెనకబడిన జిల్లా అభివృద్ధి చెందాలంటే కనెక్టివిటీ అవసరం అన్నారు. జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారుల ప్రారంభానికి జూలైలో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ జిల్లాకు వస్తారన్నారు. ఇక్కడి ప్రజల సమస్యలను స్థానిక అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని, తెలంగాణ రాష్ట్రానికి అన్ని రకాల రైల్వే సౌకర్యాలు మెరుగుపరుస్తామన్నారు. సుమారు వెయ్యి కి.మీ.,కు పైగా రైల్వే లైన్ వేయాల్సి ఉండగా, భూసేకరణ సమస్య ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున భూ సేకరణ పూర్తి చేస్తే పనులు చేపడుతామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ స్టేషన్ పరిధిలోని సివిల్ సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు.

పోటాపోటీగా నినాదాలు

మహబూబ్‌నగర్– విశాఖపట్నం రైలు ప్రారంభోత్సవం సందర్భంగా రైల్వేస్టేషన్‌లో బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలు చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వేదిక వద్దకు చేరుకుంటున్న సమయంలో ఇరుపార్టీల కార్యకర్తలు నినాదాలు చేయడంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. అనంతరం పోలీసులు ఇరు పార్టీల కార్యకర్తలను సముదాయించారు. కార్యక్రమంలో డీఆర్‌ఎం శరత్‌చంద్రయన్, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ సీతారామారావు, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేష్, ముడా చైర్మన్ గంజి వెంకన్న, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రైల్వేస్టేషన్‌లోని 'ఒక స్టేషన్ ఒక ఉత్పత్తి' స్టాల్‌ను పరిశీలించారు.

ఒకే కుటుంబం చేతిలో తెలంగాణ బందీ

- కేంద్రం నిధులతోనే రాష్ట్రం అభివృద్ధి
- డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలి
- చేనేతలకు అండగా ఉంటాం: కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే



నారాయణపేటలోని కుమ్మరివాడలో కుండ తయారుచేస్తున్న కార్మికునితో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే

నారాయణపేట: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు బీజేపీతోనే సాధ్యమైందని..రాష్ట్ర అభివృద్ధి సైతం కేంద్రం నిధులతోనే జరుగుతోందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్‌పాండే అన్నారు. ఎంతో మంది త్యాగాల వల్ల వచ్చిన తెలంగాణ ప్రస్తుతం ఒకే కుటుంబం చేతిలో బందీ అయిందని విమర్శించారు. శనివారం నారాయణపేట జిల్లాకేంద్రంతో పాటు అప్పక్‌పల్లి, కోటకొండలో జరిగిన సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ కుటుంబ కబంధ హస్తాల నుంచి విడిపించాలని, ప్రజలు కోరుకున్న సామాజిక తెలంగాణ కోసం డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని పిలుపునిచ్చారు. ఇది గణతంత్ర దేశం కానీ మమత, కేసీఆర్, నితీష్ ప్రభుత్వాలు కేంద్రం నుంచి వచ్చే పథకాలను ప్రజలకు అందించడంలో ముందుకు రావడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి పని చేస్తేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రధాని మోదీ ఒకవైపు ప్రజలకు సేవ చేయాలని చూస్తుంటే తెలంగాణలోని ప్రభుత్వ పెద్దలు తమ కుటుంబాల కోసం పని చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు సహకరించి కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. కేంద్రం ఇచ్చిన డబ్బులతోనే ఇక్కడ అభివృద్ధి పనులు చేస్తూ ప్రధాని మోదీ ఫొటో పెట్టకపోవడం సరైంది కాదన్నారు. జిల్లాలో నూతనంగా నిర్మిస్తున్న జిల్లా ఆస్పత్రికి కేంద్రం నుంచి 60శాతం నిధులు అందిస్తున్నామన్నారు. కానీ రాష్ట్రప్రభుత్వం వారే నిర్మిస్తున్నారని గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చేనేత, కుమ్మరి తదితర కులవృత్తుల వారికి కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కుండల తయారీ పరిశీలన..
జిల్లాకేంద్రంలోని కుమ్మరివాడ కార్మికులతో మాట్లాడి.. కుండల తయారీని పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా చేనేతకు చేయూత నిస్తూ, కుల వృత్తిదారులకు కేంద్రం అండగా ఉంటుందని పేర్కొన్నారు. అప్పక్‌పల్లి వద్ద జిల్లా ఆస్పత్రి పనులను జాప్యం లేకుండా నాణ్యతతో త్వరతగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. తెలంగాణకు టెక్స్‌టైల్ పార్కు మంజూరు చేశామని, చేతి వృత్తులకు ముద్రయోజన ద్వారా రుణాలిస్తున్నట్లు పేర్కొన్నారు. చేనేత కుటుంబాలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలన్నారు. ఆయా కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాసులు, నాయకులు నాగురావు నామాజీ, రతంగ్‌పాండురెడ్డి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ ప్రవాస్‌యోజన కన్వీనర్ వీరెల్లి చంద్రశేకర్, కాంతారావు, జలంధర్‌రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, సత్యయాదవ్, లక్ష్మి శ్యాంసుందర్, రఘురామయ్యగౌడ్, నందు నమాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుకు జిల్లా నేలలు అనుకూలం

- కన్మనూర్‌లో నర్సరీ, తోటల పరిశీలన
- సాగుకు రైతులు మొగ్గు చూపాలి



కన్మనూర్‌లో వివరాలు సేకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్

మరికల్: ఆయిల్‌పాం సాగుకు జిల్లాలోని నేలలు అనుకూలంగా ఉన్నాయని, రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌తోటలు సాగు చేయాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. మండలంలోని కన్మనూర్ శివారులో సాగు చేసిన ఆయిల్‌పాం తోటలను శనివారం ఆయన పరిశీలించారు. ఏడాదిలో పది నెలల పాటు దిగుబడి నిచ్చే ఆయిల్‌పాంతో మంచి లాభాలు ఉంటాయన్నారు. ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం మొక్కలకు 85 శాతం, డ్రిప్‌కు 90శాతం సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీ కల్పిస్తుందన్నారు. ఇక్కడి భూములు ఆయిల్‌తోటలకు అనుకూలంగా ఉండటంతో ఈ తోటలను సాగు చేయాలనుకున్న రైతులు ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అత్యధికంగా రైతులు ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించాలన్నారు. ఆయిల్‌పాం సాగు చేసే విధానం, నీటి యజమాన్య పద్ధతులపై రైతులు అవగాహన కల్పించారు. అనంతరం కొత్తగా ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ అధికారులు సంతోష్‌కుమార్, ఖదీర్, సమీనాబేగం, దేవప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

దిద్దుబాటు చర్యలు

- 'పది' ఫెయిలైన విద్యార్థులను సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేస్తున్న అధికారులు
- సెలవులున్నా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు
- ఉమ్మడి జిల్లాలో ఫెయిలైన వారు 9,092 మంది
- అత్యధికంగా గణితం, సైన్స్‌లోనే అనుత్తీర్ణత
- ఎక్కువ మంది ఉన్నచోట ప్రత్యక్షంగా.. తక్కువ ఉన్నచోట ఆన్‌లైన్‌లో తరగతులు

జిల్లా	పరీక్షలకు హాజరైన వారు	పాసైన వారు	ఫెయిలైన వారు
మహబూబ్‌నగర్	12,503	8,909	3,594
నాగర్‌కర్నూల్	10,545	9,582	963
నారాయణపేట	7,541	5,661	1,880
జోగుళాంబ గద్వాల	7,175	5,790	1,385
వనపర్తి	7,028	5,758	1,270



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాలపై జిల్లా విద్యాశాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులను మరోసారి గట్టెక్కించేందుకు ఉమ్మడి జిల్లాలోని విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఫెయిలైన వారిలో ఎక్కువగా గణితం, సైన్స్, ఇంగ్లిష్ వంటి సబ్జెక్టులు ఉన్నాయి. దీంతో ఆయా సబ్జెక్టులను బోధించేలా ఉపాధ్యాయులకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం వేసవి సెలవులు కొనసాగుతున్నప్పటికీ ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే కొన్ని పాఠశాలల్లో తక్కువగా మంది విద్యార్థులు ఫెయిలైన వారు ఉండటంతో వారికి ఆన్‌లైన్‌లో బోధన చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 9,092 మంది..
పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు వచ్చే నెల 14నుంచి నిర్వహించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పరీక్షలకు సిద్ధమవుతున్న వారు 9,092 మంది ఉన్నారు. ఇందులో అత్యధికంగా మంది ఫెయిల్ అయిన చోట ఉపాధ్యాయులు విద్యార్థులను పాస్ చేసే విధంగా తరగతులు తీసుకుంటున్నారు. తరగతులకు హాజరు కాలేని ఉపాధ్యాయులు విద్యార్థులను ఆన్‌లైన్, వాట్సప్, యూట్యూబ్ వంటి వాటి ద్వారా సమన్వయం చేసుకుంటూ తరగతులు బోధిస్తున్నారు. అయితే కొన్నిచోట్ల విద్యార్థులకు తరగతులు బోధించేందుకు కొంతమంది ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తుంది. అన్ని జిల్లాల్లోని పాఠశాలల్లో తరగతులు తీసుకున్న ఉపాధ్యాయులు ప్రతిరోజు ఫొటోలను వాట్సప్ ద్వారా పంపించాలని ఆదేశిస్తున్నా పలువురు పట్టించుకోవడం లేదు.

ప్రత్యేక దృష్టిపెట్టాం..



జిల్లాలో ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీలో ఉత్తీర్ణత సాధించేలా వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. పాఠశాలల్లో విద్యార్థులకు తరగతులు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించాం. ప్రత్యక్షంగా లేదా ఆన్‌లైన్ తరగతుల ద్వారా అయినా తరగతులు బోధించేలా చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే నెల 14 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ సమయానికి వారిని సిద్ధం చేస్తాం.
– గోవిందరాజులు, డీఈఓ, నాగర్‌కర్నూల్, వనపర్తి

బాధ్యతగా నిర్వహిస్తున్నాం..



ఫెయిలైన విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు మా పరిధిలోని పాఠశాలల్లో తరగతుల్లో ఇంగ్లిష్, గణితం బోధిస్తున్నాం. వేసవి సెలవులు అయినప్పటికీ ఉపాధ్యాయులు బాధ్యతగా విద్యార్థులకు నష్టం జరగకూడదని తరగతులు నిర్వహిస్తున్నాం. అందరూ పాస్ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.
– జగదీష్, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్ కొల్లూర్, నవాబుపేట మండలం

క్లుప్తంగా

పిడుగుపాటుకు గురై మహిళ మృతి

వంగూరు: మండలంలోని వెంకటాపూర్‌లో శనివారం పిడుగుపాటుకు గురై ఓ మహిళ మృతిచెందింది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామశివారులోని వ్యవసాయ పొలంలో 15 మంది కూలీలు పనులు చేస్తుండగా సాయంత్రం సమయంలో ఉరుములు, మెరుపులతో వర్షంతో పాటు పిడుగుపడింది. ఈ ప్రమాదంలో కృష్ణమ్మ (45) అక్కడికక్కడే మృతి చెందగా.. వెంకటమ్మ, మణెమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా రంగాపూర్‌కు చెందిన రైతు బక్కయ్య ఆవు కూడా పిడుగుపాటుకు గురై మృతిచెందింది.

బైక్ అదుపు తప్పి వ్యక్తి..

చిన్నంబావి: బైక్ అదుపు తప్పి కిందపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని కల్వకోల్‌కి చెందిన అబ్దుల్ హుస్సేన్(45) పెబ్బేరు నుంచి తన స్వగ్రామమైన కల్వకోల్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. చిన్నంబావి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి పడిపోవడంతో గమనించిన స్థానికులు వెంటనే కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యంలోనే మృతిచెందినట్లు తెలియజేశారు.

పొగతో ఊపిరాడక కూలీ..

అచ్చంపేట రూరల్: పొగ వ్యాపించడంతో ఓ కూలీ ఊపిరాడక మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని వంకమూతి తండాలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా రంగారావుపేటకు చెందిన నర్సింహారావు(64) తన భార్య కనకమ్మతో కలిసి మండలంలోని వంకమూతితండాలో కొండమోని జంగమ్మ వ్యవసాయం పొలంలో కూలీ పనులు చేయడానికి ఆరు నెలల క్రితం వచ్చారు. శనివారం పొలం గట్ల వద్ద ఉన్న పిచ్చి చెట్లకు నిప్పు పెట్టారు. సమీపంలో ఉన్న గడ్డివాము వైపు మంటలు చెలరేగుతుండటంతో మంటలను ఆర్పే క్రమంలో అటువైపు ఎక్కువగా పొగ రావడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. తన భర్త చావుకు ఎవరూ కారణం కాదని భార్య కనకమ్మ సిద్దాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు.

మద్యానికి బానిసై..

గద్వాల క్రైం: మద్యానికి బానిసై వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుందని పట్టణ ఎస్‌ఐ రామస్వామి తెలిపారు. షేరెల్లివీధికి చెందిన రామయ్య మద్యానికి బానిసై జులాయిగా తిరిగేవాడు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చి పట్టణంలోని శ్రీలక్ష్మీ వైన్స్ పైఅంతస్తులో మద్యం తాగి అక్కడే పడుకున్నాడన్నారు. శనివారం ఉదయం మద్యం సేవించేందుకు వెళ్లిన వ్యక్తులు గమనించి మృతి చెందినట్లు గుర్తించారు. స్థానిక పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ యువకుడు..


సాయికుమార్ (ఫైల్)

చిన్నంబావి: పురుగు మందు తాగిన ఓ యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని కొప్పునూరుకు చెందిన సాయికుమార్ (23) ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో మనస్థాపానికి గురై బుధవారం పురుగుమందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

వెంటాడిన మృత్యువు


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తల్లి జమ్ములమ్మ, కొడుకు అర్జున్


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రంగస్వామి, సీఐ చంద్రశేఖర్

బతుకుదెరువు కోసం ఆటోలో వెళ్తుండగా ఢీకొట్టిన బొలెరో

- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి దుర్మరణం
- పెళ్లి జరిగి మూడు నెలలు గడవక ముందే నవదంపతుల మృత్యువాత
- మిన్నంటిన బంధువుల రోదనలు
- జోగుళాంబ గద్వాల జిల్లాలో విషాదం

ధరూరు: నిత్యం రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబం వారిది.. ఈ క్రమంలో ప్రతిరోజు ఉదయమే ఆటోలో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి పాత చీరలు అమ్మడం.. పాత చీరలు తీసుకుని బొంతలు కుట్టి ఇవ్వడం చేసుకుంటూ జీవనం సాగిన్నారు. ఈ క్రమంలో శనివారం సైతం ఉదయమే ఆటోలో బయలుదేరిన ఆ కుటుంబానికి అదే చివరి ప్రయాణమైంది. మృత్యువు రూపంలో దూసుకొచ్చిన బొలెరో వాహనం వీరి ఆటోను ఢీకొట్టడంతో అక్కడికక్కడే తల్లి, కొడుకు, కోడలు మృతి చెందారు. కుటుంబ పెద్ద గత కొన్నేళ్ల క్రితమే మరణించగా.. ఉన్న ఒక్కగానొక్క కొడుకును అల్లారు ముద్దుగా పెంచుకుని.. మూడు నెలల క్రితమే పెళ్లి చేసిన ఆ తల్లికి.. ఎన్నో కలలతో అత్తారింటికి అడుగు పెట్టిన ఆ ఇల్లాలికి.. వీరిద్దరిని కంటికి రెప్పలా కాపాడుకుందామనుకున్న ఆ యువకుడి ఆశలు అడియాసలుగానే మారిపోయాయి. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలంలోని పారుచర్ల సమీపంలో చోటుచేసుకున్న ఈ విషాదకర సంఘటనకు సంబంధించి వివరాలిలా..

గద్వాల మున్సిపాలిటీ ఏడో వార్డు పరిధిలోకి వచ్చే దౌదర్‌పల్లికి చెందిన బొప్పలి జమ్ములమ్మ(55), ఆమె కుమారుడు అర్జున్(24), కోడలు వైశాలి(22) పల్లెల్లో నిత్యం బొంతలు కుట్టడం.. పాత చీరలు అమ్మడం వంటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో తమ ఆటోలో గద్వాల నుంచి రాయిచూరుకు బయలుదేరారు. అయితే మార్గంలోని పారుచర్ల– ధరూరు గ్రామాల మధ్య రాయిచూరు వైపు నుంచి వచ్చిన బొలెరో, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో వెళ్తున్న జమ్ములమ్మ, అర్జున్, వైశాలి అక్కడికక్కడే మృతిచెందారు. వెంటనే వాహనదారులు, చుట్టుపక్కల పొలాల రైతులు అక్కడికి చేరుకుని ఆటోలో ఇరుక్కున్న ముగ్గురి మృతదేహాలను బయటకు తీశారు. బొలెరో పెబ్బేరులో జరిగే సంతకు రైతుల ఎద్దులతో వెళ్తున్నట్లు తెలిసింది. సంఘటన జరిగిన వెంటనే బొలెరో డ్రైవర్‌తోపాటు మిగతా అందరూ పరారయ్యారు.

కేసు నమోదు..

విషయం తెలుసుకున్న రేవులపల్లి ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి పోలీసులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గద్వాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. రోడ్డుకు అడ్డంగా పడిన బొలెరో వాహనాన్ని పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అనంతరం సంఘటనా స్థలానికి డీఎస్పీ రంగస్వామి, సీఐ చంద్రశేఖర్ చేరుకుని ప్రమాదానికి గల కారణాలు, వివరాలను ఎస్‌ఐ శేఖర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

2018 సంఘటన గుర్తుకు..

నాలుగేళ్ల క్రితం అదే ప్రాంతానికి 2 కి.మీ., దూరంలో జరిగిన రోడ్డు ప్రమాదాన్ని గుర్తు చేసింది. మండలంలోని పారుచర్ల, చిన్నపాడు గ్రామాలకు చెందిన కూలీలు 2018, జనవరి 8న పత్తి మిల్లుల్లో పని చేయడానికి వెళ్లి తిరిగి వస్తుండగా బొలెరో డ్రైవర్ తెల్లవారుజామున నిద్ర మత్తులో ఢీకొట్టడంతో ఐదు మంది అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఇద్దరు చికిత్స పొందుతూ చనిపోయారు. శనివారం జరిగిన ప్రమాదం సైతం అదే తరహాలో కనిపించిందని స్థానికులు గుర్తు చేసుకున్నారు.

■ బొలెరో వాహనం డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతురాలు జమ్ములమ్మ కుమార్తె పల్లవి ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెళ్లి జరిగి మూడు నెలలే..

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అర్జున్‌కు మూడు నెలల క్రితమే హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన వైశాలితో వివాహం జరిగినట్లు బంధువులు తెలిపారు. పెళ్లి జరిగిన ఆనందం వారి కుటుంబంలో ఎంతో కాలం నిలవలేదని వాపోయారు. ఇంటి వారసులు కూడా లేకుండా కుటుంబమంతా మృత్యువాత పడ్డారని బోరున విలపించారు. ఎవరినీ ఏమీ ఆశించకుండా ముగ్గురు జీవనం సాగిస్తూ.. కలిసే తనువు చాలించారా అని రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

ఒండ్రుమట్టి కుప్పే కారణమా..?

సంఘటన స్థలం వద్ద ఉన్న ఓ ఒండ్రుమట్టి కుప్ప ప్రమాదానికి కారణమని పలువురు అనుమానం వ్యక్తం చేశారు. మూడు నెలలుగా గద్వాల మండలం కొండపల్లి నుంచి గట్టు మండలం రాయాపురం ప్రాంతంలో జరుగుతున్న గట్టు ఎత్తిపోతల పనులకు తరలిస్తున్న ఒండ్రుమట్టి ట్రిప్పర్ వారం రోజులుగా రాజారెడ్డి పొలం వద్ద చెడిపోయింది. అక్కడే ఒక ట్రాక్టర్ లోడుకు సరిపడా ఒండ్రుమట్టి పడిపోయింది. సంబంధిత కాంట్రాక్టర్ దానిని తొలగించాల్సి ఉన్నా పట్టించుకోలేదు. రోడ్డు మీద మట్టి కుప్ప ఉండటంతో గద్వాల వైపు నుంచి వస్తున్న ఆటో డ్రైవర్‌కు దగ్గరకు వచ్చాక కనిపించి ఉండవచ్చని, దీంతో వెంటనే మట్టి కుప్పను తప్పించబోయిన అర్జున్ ఆటోను రైట్ సైడ్‌కు తిప్పడంతో బొలెరో ఢీకొట్టి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వీధి కుక్కల దాడి: బాలుడు, వృద్ధుడికి తీవ్రగాయాలు


లింగాలలో వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలుడు

లింగాల: వీధి కుక్కల దాడులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శనివారం మండల కేంద్రంలో ఆరుబయట ఆటలాడుకుంటున్న అల్లె పునీత్‌కుమార్ ఐదు సంవత్సరాల బాలుడిపై కుక్క దాడి చేసింది. దీంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. కుక్కల దాడిని గమనించిన కొందరు బాలుడిని రక్షించడంతో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. ఇదే సమయంలో మండల పరిధిలోని అంబట్‌పల్లిలో బాలయ్య అనే వృద్ధుడిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించి చికిత్స చేయించారు. కుక్కల దాడిలో గాయపడిన బాలుడికి, వృద్ధుడి ఎలాంటి ప్రాణాపాయ స్థితి లేదని వైద్యాధికారి శివశంకర్ తెలిపారు. చికిత్స నిర్వహించి మందులను అందజేసినట్లు చెప్పారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



అమ్రాబాద్: పదర మండలంలోని చిట్లంకుంట, చెన్నపల్లి గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం సారా విక్రయాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ పోలీసులు స్థానిక సివిల్ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సోదాలు నిర్వహించి 18 లీటర్ల సారా, 50 కిలోల నల్లబెల్లం, 20 కిలోల స్పటికను పట్టుకున్నారు. 650 లీటర్ల బెల్లం ఊటను పారబోశారు. సారా బట్టీలకు వినియోగించే డ్రమ్ములు, ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గణపతిరెడ్డి, పదర ఎస్‌ఐ తిరుపతిరెడ్డి, ఎక్సైజ్ ఎస్‌ఐ బాలరాజు, టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.కోటిన్నరకు పైగా టోకరా?

- పరారీలో రాజస్థాన్ వ్యాపారి



శివం వస్త్ర దుకాణం

గద్వాల క్రైం: రూ.కోటిన్నరకు పైగా అప్పులు చేసి, రాజస్థాన్‌కు చెందిన ఓ వస్త్ర వ్యాపారి పరారయ్యాడు. ఈ సంఘటన గద్వాల పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. రాజస్థాన్‌కు చెందిన అరవింద్ కొన్నేళ్లుగా జిల్లా కేంద్రంలోని క్రిష్ణవేణి చౌక్‌లో శివమ్ ఫ్యాషన్స్ రెడీమేడ్ వస్త్ర దుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. రెండవ రైల్వే గేట్ సమీపంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని కుటుంబ సభ్యులతో కలసి ఉంటున్నాడు. వస్త్ర వ్యాపారంలో వడ్డీ వ్యాపారులు, వినియోగదారులతో మంచి సంబంధాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసేవాడు. ఈ క్రమంలో వడ్డీ వ్యాపారులతో, ప్రైవేట్ బ్యాంకుల నుంచి రూ.కోటిన్నరకు పైగా అప్పులు చేశాడు. తిరిగి చెల్లించే క్రమంలో నిర్లక్ష్యం వహించాడు. అప్పు ఇచ్చిన ప్రైవేట్ బ్యాంకు నిర్వాహకులు, వడ్డీ వ్యాపారులు తమ వద్ద తీసుకున్న అప్పును చెల్లించాల్సిందిగా మూడు నెలల నుంచి అడుగుతున్నారు. త్వరలోనే చెల్లిస్తామని నమ్మబలుకుతూ వస్తున్నాడు. అప్పు చెల్లించే ఉద్దేశం లేకపోవడంతో 10రోజుల నుంచి ఇంట్లో వస్తు సామాగ్రిని గుట్టుగా ఖాళీ చేయించాడు. అనుమానం కలుగకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. రోజువారిలాగే వస్త్ర దుకాణం తెరిచి ఉంటున్నాడు. ఇక శుక్రవారం రాత్రి అప్పు తీసుకున్న వ్యాపారులకు తిరిగి డబ్బులు చెల్లిస్తామని చెప్పి నమ్మించాడు. దీంతో పలువురు వడ్డీ వ్యాపారులు అప్పుకోసం దుకాణం వద్దకు చేరుకున్నారు. అప్పు చెల్లిస్తామని చెప్పిన అరవింద్ దుకాణం వద్దకు రాకుండా గుర్తు తెలియని ప్రదేశానికి వెళ్లాడు. అక్కడ పనిచేసే సిబ్బంది సైతం మెల్లగా అక్కడి నుంచి జారుకున్నారు. గంట సేపటి తర్వాత దుకాణం వద్దకు ఎవరూ రాకపోవడం, ఫోన్ స్విచాఫ్ చేసుకోవడంతో అప్పు ఇచ్చిన వారికి అనుమానం వచ్చి, షాపు అద్దెకు ఇచ్చిన యజమానికి సమాచారం అందించారు. ఆయన కూడా దుకాణం వద్దకు చేరుకున్న తర్వాత యజమాని, వ్యాపారస్తులు పట్టణ పోలీసులను ఆశ్రయించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. అయితే మోసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు వివరించారు. ఈ విషయంపై పట్టణ ఎస్‌ఐ రామస్వామిని 'సాక్షి' వివరణ కోరగా.. తమకు ఫిర్యాదు అందలేదని చెప్పారు.

చెరువులో పడి పాస్టర్ మృతి


బాలకోటయ్య (ఫైల్)

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్ చెరువులో పడి చర్చి పాస్టర్ శనివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఒంగోలు జిల్లా పెద్దారివీడు మండలం రాజ్యంపల్లికి చెందిన బాలకోటయ్య (52) పదేళ్ల క్రితం కల్వకుర్తికి వచ్చి ఇందిరానగర్‌కాలనీలో దేవుని సంఘం పేరుతో చర్చి ఏర్పాటుచేసి పాస్టర్‌గా వ్యవహరించేవాడు. అతడి బంధువులైన చిట్టిబాబు, గురువయ్య, ఇజ్రాయిల్‌కు బాప్టిజం(పవిత్ర స్నానం) చేయించేందుకు శనివారం ఉదయం మండలంలోని తర్నికల్ శివారులో ఉన్న చెరువుకు వెళ్లాడు. స్నానం చేస్తుండగా ఈత రాని ఇజ్రాయిల్ చెరువులో మునిగిపోగా.. అతడిని రక్షించడానికి చిట్టిబాబు, గురువయ్య ప్రయత్నించారు. వారికి ఈత రాకపోవడంతో చెరువులో మునిగిపోతుండగా బాలకోటయ్య వారిని రక్షించేందుకు వెళ్లాడు. వీరి ఆర్తనాదాలు విని చెరువు పక్కనే ఉన్న వెంకట్రాములుగౌడ్ ఓ తాడు తీసుకొచ్చి అందరిని రక్షించే ప్రయత్నం చేశారు. ఇందులో బాలకోటయ్య లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతానికి వెళ్లడంతో నీట మునిగి మృతిచెందగా.. మిగిలిన వారిని రక్షించారు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్‌సిబ్బంది చెరువులో గాలింపు చేపట్టి బాలకోటయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. భార్య స్వరాజ్యం ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రభుత్వ ఆస్పత్రిలో బాలకోటయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరు యువకుల దుర్మరణం

- మహబూబ్‌నగర్ జిల్లా కంచన్‌పల్లిలో విషాదఛాయలు


పొలంలో బోల్తాపడిన ట్రాక్టర్


రమేష్ (ఫైల్)


పవన్ (ఫైల్)

మహమ్మదాబాద్: ఇంటి దగ్గర ఉన్న ట్రాక్టర్‌ను పొలానికి తీసుకెళ్తుండగా ప్రమాదవశాత్తు బోల్తాపడి ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలంలోని కంచన్‌పల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం.. కంచన్‌పల్లికి చెందిన ర్యాకమోల్ల భవనయ్య కుమారుడు రమేష్(19) అదే గ్రామానికి చెందిన రాజు దగ్గర ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గండేడ్ మండలం కొండెడ్డిపల్లికి చెందిన ఏముక పవన్‌కుమార్(19) చిన్నప్పటి నుంచి తన తాతగారి గ్రామమైన కంచన్‌పల్లికి చెందిన బెస్త వెంకటయ్య దగ్గర ఉంటున్నాడు. వీరిద్దరు కలిసి ట్రాక్టర్ డ్రైవింగ్‌తో పాటు పనికి కూడా వెళ్లేవారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ట్రాక్టర్ ఇంజిన్‌ను పొలం దగ్గర చెట్టు నీడకు పెట్టమని యజమాని రాజు చెప్పడంతో ఇద్దరూ కలిసి రమేష్ డ్రైవింగ్ చేస్తూ పొలం దగ్గరకు వెళ్తున్నారు. అయితే పొలంలో ఒడ్డు దింపుతుండగా రాయి తగిలి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందారు. తర్వాత అటుగా వెళ్తున్న ఓ యువకుడు గమనించి గ్రామస్తులకు సమాచారం అందించగా అందరూ అక్కడికి వెళ్లి ట్రాక్టర్‌ను పైకిలేపారు. ఈ ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ సైదయ్య తెలిపారు.

గ్రామంలో విషాదఛాయలు

రమేష్, పవన్‌కుమార్ మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇరువురి కుటుంబీకులు గుండెలవిసేలా విలపిస్తున్నారు. కాగా పవన్‌కుమార్ తండ్రి 20 రోజుల క్రితమే మృతిచెందాడు. ఇప్పుడు కుమారుడు సైతం మృత్యువాత పడటంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

బొలెరో ఢీకొని ఆటోడ్రైవర్..

- మరొకరికి తీవ్ర గాయాలు


కన్నయ్య (ఫైల్)

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో శనివారం కర్నూల్‌కు వెళ్లేందుకు ఆటో యూటర్న్ తీసుకుంటున్న సమయంలో వెనక నుంచి వేగంగా బొలెరో వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆటోడ్రైవర్ కన్నయ్య(37) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న ప్యాసెంజర్‌కు తీవ్ర గాయాలయ్యాయని ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కర్నూల్ నుంచి శుక్రవారం అర్ధరాత్రి ఆటోలో కిరాయికి ప్యాసెంజర్లను తరలిస్తుండగా అవతలి రోడ్డుకు వెళ్లే క్రమంలో ఆటో యూటర్న్ చేయడంతో వెనక నుంచి నంద్యాలకు వెళ్లే ప్యాసెంజర్లు తరలించే బొలెరో వాహనం ఆటోను ఢీ కొట్టడంతో ఆటో ఒక్కసారిగా రోడ్డు అవతలికి బోల్తా పడినట్లు తెలిపారు. ఆటోలో ఉన్న డ్రైవర్ దొమ్మరి కన్నయ్య(37) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్యాసెంజర్ సరస్వతి తీవ్రంగా గాయపడ్డారు. వీరిరువురూ కర్నూల్‌కు చెందినవారని తెలిపారు. మృతదేహాన్ని కర్నూల్ ఆస్పత్రికి తరలించి, పంచనామా అనంతరం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య కళ్యాణి ఫిర్యాదు మేరకు బొలెరో వాహనం డ్రైవర్ భరద్వాజ్ శర్మపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వివాహిత బలవన్మరణం

అలంపూర్ రూరల్: నిప్పంటించుకుని వివాహిత బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని శింగవరం–1లో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కర్నూల్‌కు చెందిన మల్లిక (24)ను శింగవరం–1 చెందిన చాకలి హరికృష్ణతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. కొన్ని రోజుల నుంచి కుటుంబ కలహాలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో గ్రామపెద్దలతో పంచాయితీ పెట్టి సర్దిచెప్పారు. కాగా శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటికి నిప్పంటించుకుని బలవన్మరణానికి పాల్పడింది. వీరికి ఆరు నెలల బాబు ఉన్నాడు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ మహేందర్ పరిశీలించారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

అచ్చంపేట రూరల్: భర్త, అత్తామామలు వేధిస్తున్నారని ఓ వివాహిత సిద్దాపూర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసింది. మండలంలోని బక్కలింగాయపల్లికి చెందిన రోజాతో పదర మండలం ఉడిమిళ్లకు చెందిన రమేష్‌కు మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి 15 నెలల కుమార్తె ఉంది. ఆరు నెలల నుంచి భర్త, అత్తామామలు, మరిది అదనపు కట్నం తీసుకురావాలని.. లేదంటే మరో యువతితో రమేష్‌కు వివాహం జరిపిస్తామంటూ మానసికంగా వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.




అన్నదాతకు అండగా..

అన్నం పెట్టే రైతన్నలకు కళాశాల విద్యార్థులు అండగా నిలిచారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రం సమీపంలో నెల్లికొండ మార్కెట్ యార్డులో శనివారం అకస్మాత్తుగా మేఘావృతమైంది. దీంతో రైతులు తమ ధాన్యం వర్షానికి తడిసిపోకుండా కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిని గమనించిన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు.. ప్రిన్సిపల్ షాజహాన సుల్తానా ఆదేశాల మేరకు సుమారు వందమంది మార్కెట్ యార్డులోకి ప్రవేశించారు. మార్కెట్‌లో ఆరబోసిన ధాన్యాన్ని కుప్పగా పోసి టార్పాలిన్ కవర్ కప్పి.. ధాన్యం తడవకుండా చేసి పలువురి చేత శెభాష్ అనిపించుకున్నారు. విద్యార్థులు చేసిన పనికి రైతులు చేతులెత్తి కృతజ్ఞతలు తెలిపారు. – కందనూలు

క్లుప్తంగా...



వేమూరు నుంచి కొల్లూరు వరకు పాద యాత్ర చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసనల వెల్లువ

కావలి/వేమూరు/ఏర్పేడు/చీపురుపల్లి: పేదలకు స్థలాలు, ఇళ్ల ఇస్తుంటే ఓర్వలేని చంద్రబాబు పేదల ద్రోహిగా మారి వారిపై అక్కసు వెళ్లగక్కుతున్నారంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రంలో పలుచోట్ల శనివారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సెంటు స్థలం ఇచ్చి, ఇళ్లు నిర్మించి ఇస్తుంటే చూసి ఓర్వలేని చంద్రబాబు సెంటు స్థలంలో సమాధులు కట్టుకోవాలా అంటూ అహంకారపూరితంగా మాట్లాడుతున్నాడని నాయకులు ఈ సందర్భంగా మండిపడ్డారు. బాపట్ల జిల్లా వేమూరులో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ నుంచి కొల్లూరు అనంత భోగేశ్వరస్వామి ఆలయం వరకు పేదలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం పాదయాత్ర జరిపారు. పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలు, ఇళ్లపై అపహేళన చేస్తూ మాట్లాడిన చంద్రబాబుపై కేసు నమోదు చేసి తక్షణం అరెస్ట్ చేయాలని కోరుతూ విజయనగరం జిల్లా చీపురుపల్లి పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఇళ్ల లబ్ధిదారులు శనివారం ఫిర్యాదు చేశారు.

ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బ తీస్తున్న చంద్రబాబు

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

దొండపర్తి (విశాఖ దక్షిణ): ఎన్నికల్లో ప్రజలు ఓడించారన్న అక్కసుతో చంద్రబాబునాయుడు రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బ తీస్తున్నారని ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. రాష్ట్రం అన్ని విధాలా బాగు పడుతుంటే చూడలేని చంద్రబాబు.. పిచ్చి ప్రేలాపనలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విశాఖ ప్రభుత్వ అతిథి గృహంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం మీద, ఓడించిన ప్రజల మీద, ఉత్తరాంధ్రపై.. ముఖ్యంగా విశాఖపట్నంపై చంద్రబాబు ఎందుకంత పగబట్టారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

తండ్రి హంతకులకు అండదండలా?

వివాదాస్పదంగా మారిన సునీత వైఖరి

జైల్లో ఉన్న ప్రధాన నిందితుడు ఎర్ర గంగిరెడ్డిని కలిసేందుకు తాజాగా యత్నం

- వివేకా హంతకుడు దస్తగిరి బెయిల్ రద్దు పిటిషన్‌ను వ్యతిరేకించిన సునీత
- వాస్తవాలు వెల్లడించకుండా కట్టడి చేసేందుకే సునీత తాపత్రయం
- తన భర్త, బావ పాత్ర బయటపడకుండా ఉంచాలన్నదే లక్ష్యం

సాక్షి, అమరావతి: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆయన కుమార్తె సునీత తీరు మరోసారి వివాదాస్పదమైంది. తండ్రిని హత్యచేసిన వారికి శిక్షలు పడేందుకు పోరాడుతున్నానని చెబుతున్న ఆమె వ్యవహారశైలి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉండటం అనేకానేక సందేహాలు లేవనెత్తుతోంది. వివేకాను హత్యచేశానని స్వయంగా ఒప్పుకున్న దస్తగిరికి ఆమె పూర్తి అండదండలు అందిస్తుండటం తెలిసిందే. మరోవైపు.. వివేకా హత్యకేసులో ప్రధాన నిందితుడు ఎర్ర గంగిరెడ్డిని హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో కలిసేందుకు సునీత శుక్రవారం ప్రయత్నించడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దస్తగిరి బెయిల్ వ్యవహారంలో సునీత వ్యవహారశైలి.. అనంతరం ఎర్ర గంగిరెడ్డిని కలిసేందుకు ఆమె యత్నించడానికి సంబంధం ఉన్నట్లుగా స్పష్టమవుతోంది. తన తండ్రి హత్య కేసులో ప్రధాన నిందితులను ప్రభావితం చేయడం ద్వారా ఈ కేసు దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు ఆమె యత్నిస్తున్నట్లుగా స్పష్టమవుతోంది. అసలు వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో తలెత్తిన విభేదాలు ఆయన హత్యకు దారితీసి ఉండొచ్చన్న బలమైన ఆరోపణలకు సునీత ప్రస్తుత వ్యవహారశైలి బలం చేకూరుస్తోంది.

హంతకుడు దస్తగిరికి సునీత అండదండలు..

సాధారణంగా తండ్రిని హత్యచేసిన వారిపై ఎవరికైనా ఆగ్రహం ఉంటుంది. కానీ, వైఎస్ వివేకానంద రెడ్డిని స్వయంగా హత్యచేశానని ఒప్పుకున్న దస్తగిరిపై ఆయన కుమార్తె సునీత అంతులేని సానుకూలత ప్రదర్శిస్తున్నారు. సీబీఐ దస్తగిరిని అప్రూవర్‌గా మార్చడాన్ని ఆమె ఏమాత్రం వ్యతిరేకించలేదు. అనంతరం.. బెయిల్ కోసం దస్తగిరి పిటిషన్ వేస్తే సీబీఐ అభ్యంతరం వ్యక్తంచేయలేదు. అంతేకాదు.. సునీత కూడా అతని బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకించలేదు. మరోవైపు.. అసలు హత్యచేసిన దస్తగిరిని అప్రూవర్‌గా మార్చడాన్ని వివేకా పీఏ కృష్ణారెడ్డి న్యాయస్థానంలో సవాల్ చేశారు. అతనికి ఇచ్చిన బెయిల్‌ను రద్దుచేయాలని కూడా కోర్టును కోరారు. కానీ, సునీత వెంటనే ఈ కేసులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం విస్మయపరిచింది. అలాగే, దస్తగిరి బెయిల్‌ను రద్దుచేయాల్సిన అవసరంలేదని ఆమె న్యాయస్థానికి తెలపడం గమనార్హం. అంతేకాదు.. ఈ కేసుకు సంబంధించి కృష్ణారెడ్డికి ఎలాంటి అర్హతలేదని.. బాధితురాలిగా తనకే అది ఉందని ఆమె వాదించారు. దస్తగిరి బెయిల్‌పై బయట ఉండటంపట్ల తనకేమాత్రం అభ్యంతరంలేదని చెప్పుకొచ్చారు. అసలు తన తండ్రిని హత్యచేసిన వ్యక్తి జైలులో ఉండాలని కోరుకోవాల్సిన సునీత.. అతను బయట ఉండాలని ఆశిస్తుండటం వెనుక ఏదో మతలబు ఉందన్నది స్పష్టమవుతోంది.

దస్తగిరి వాంగ్మూలాన్ని బలపర్చాలనే..

నిజానికి.. దస్తగిరి అప్రూవర్‌గా ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్న అంశాలతో ఎర్ర గంగిరెడ్డి విభేదించారు. సీబీఐ నమోదు చేసిన దస్తగిరి అప్రూవర్ వాంగ్మూలంలో చెప్పినవన్నీ అవాస్తవాలని ఆయన చెప్పారు. దాంతో దస్తగిరి అప్రూవర్‌గా ఇచ్చిన వాంగ్మూలం అంతా కట్టుకథేనని తేలిపోయింది. ఈ నేపథ్యంలో.. ఎర్ర గంగిరెడ్డిని కలిసి దస్తగిరి అప్రూవర్‌గా ఇచ్చిన వాంగ్మూలంలోని అంశాలను బలపరచాలని ఒత్తిడి చేయడమే సునీత ఉద్దేశంగా తెలుస్తోంది. అందుకోసం ఎర్ర గంగిరెడ్డిని ప్రలోభాలకు గురిచేయడం.. ఆయన బెయిల్‌కు సీబీఐ సహకరించేట్లుగా చేస్తానని హామీ ఇవ్వడం ఆమె ప్రణాళికగా ఉంది. వివేకా హత్య అనంతరం అక్కడ ఆధారాలను ధ్వంసం చేయాలని ఎర్ర గంగిరెడ్డిని సునీత భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, బావ శివప్రకాశ్‌రెడ్డి ఆదేశించారు. ఇదే అంశం సునీత, ఆమె భర్తకు ప్రతికూలంగా మారింది. ఈ విషయంలో మాట మార్చాలని.. ఆధారాల ధ్వంసంతో తన భర్తకు సంబంధంలేదని ఎర్ర గంగిరెడ్డితో చెప్పించాలన్నది సునీత ఉద్దేశం. తాను చెప్పినట్లు చేస్తే ఎర్ర గంగిరెడ్డికి బెయిల్ వచ్చేందుకు సహకరిస్తామని ఆమె హామీ ఇచ్చేందుకు యత్నించినట్లు తెలిసింది.

వేళ్లన్నీ సునీత, ఆమె భర్తవైపే..

ఈ మొత్తం పరిణామాలతో వివేకా హత్యకేసు దర్యాప్తును ప్రభావితం చేసేందుకు సునీత ప్రయత్నిస్తున్నారన్నది స్పష్టమైంది. ఆమె ఎందుకు హంతకులకు కొమ్ముకాస్తూ మరీ హత్య కేసు దర్యాప్తు దారి మళ్లించేందుకు యత్నిస్తున్నారన్నది కీలక ప్రశ్నగా మారింది. ఎందుకంటే.. వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో ఆస్తి, రాజకీయ వారసత్వ విభేదాలు తలెత్తాయన్నది బహిర్గతమైంది. ఈ నేపథ్యంలో.. వివేకా హత్యకు గురికావడంతో ఆయన సొంత కుటుంబ సభ్యులపై సందేహాలు వ్యక్తమయ్యాయి. వివేకా హత్య తరువాత ఆయన రాసిన లేఖ, సెల్‌ఫోన్లను పోలీసులకు వెంటనే ఇవ్వకుండా గోప్యంగా ఉంచమని పీఏ కృష్ణారెడ్డితో సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి చెప్పారు. ఇదే అంశంపై సీబీఐ ఇటీవల వారిని విచారించింది కూడా. నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి ఆదేశాలతోనే వివేకా హత్య స్థలంలో ఆధారాల ధ్వంసం చేశారన్నది వెల్లడైంది కూడా. వివేకా రాజకీయ ప్రత్యర్థులైన టీడీపీ నేత బీటెక్ రవి, అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రి ఆదినారాయణరెడ్డితో సునీత భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, బావగారు శివప్రకాశ్‌రెడ్డి అత్యంత సన్నిహితంగా ఉంటున్నారన్నది కూడా బహిరంగ రహస్యంగా మారింది.

ఎర్ర గంగిరెడ్డిని కలిసే ప్రయత్నం ఎందుకో!?

ఇక వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న ఎర్ర గంగిరెడ్డిని జైల్లో కలిసేందుకు సునీత ప్రయత్నించడం ఇప్పుడు విస్మయపరుస్తోంది. గంగిరెడ్డిని కలిసేందుకు ఆమె జైలు అధికారులను అనుమతి కోరగా వారు నిరాకరించారు. దాంతో ఆమె తన న్యాయవాది ద్వారా కొన్ని పత్రాలు ఆయన వద్దకు పంపి సంతకాలు తీసుకున్నట్లు సమాచారం. అసలు తన తండ్రి హత్య కేసులో ఏ–1గా ఉన్న గంగిరెడ్డిని సునీత కలిసేందుకు యత్నించడం సందేహాస్పదంగా మారింది. సుప్రీంకోర్టు బెయిల్ రద్దుచేయడంతో ఎర్ర గంగిరెడ్డి పోలీసుల ముందు లొంగిపోయి ప్రస్తుతం జైలులో ఉన్నారు. తాను చెప్పినట్లుగా చెబితే దస్తగిరికి సహకరించినట్లుగానే ఎర్ర గంగిరెడ్డికి సహకరిస్తామని ఆయనకు చెప్పేందుకే సునీత ప్రయత్నించినట్లు సమాచారం.

వాస్తవాలు వెల్లడి కాకూడదనే..

ఈ నేపథ్యంలో.. వివేకా హత్య కేసులో సునీత భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, బావ శివప్రకాశ్‌రెడ్డిల పాత్ర ఉందనే వాదన బలపడుతోంది. అంటే ఈ కేసులో వారిని నిందితులుగానే భావించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాబట్టి తాము బాధితులమని.. తమకే అర్హత ఉందని చెప్పేందుకు వారు నైతిక హక్కు కోల్పోయారు. మరోవైపు.. ఎర్ర గంగిరెడ్డి సీబీఐ ముందు నిజాలు వెల్లడిస్తే తమ కుటుంబానికి ఇబ్బందిగా మారుతుందని సునీత ఆందోళన చెందుతున్నారు. అందుకే వాస్తవాలు వెల్లడించకుండా కట్టడి చేసేందుకే ఎర్ర గంగిరెడ్డిని కలిసేందుకు సునీత యత్నించినట్లు స్పష్టమవుతోంది.

శ్రీవారి ఆర్జిత సేవలు, వీఐపీ దర్శనాల్లో స్వల్ప మార్పులు

తిరుమల: వేసవి సెలవుల కారణంగా తిరుమలలో భక్తుల రద్దీ రోజురోజుకూ అనూహ్యంగా పెరుగుతోంది. సర్వదర్శనం భక్తులకు దాదాపు 30 నుంచి 40 గంటల సమయం పడుతోంది. శుక్ర, శని, ఆదివారాల్లో భక్తులు వేచి ఉండే సమయం ఇంకా ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో సామాన్య భక్తుల సౌలభ్యం కోసం జూన్ 30వ తేదీ వరకు స్వామి వారి సేవలు, వీఐపీ దర్శనాల్లో స్వల్ప మార్పులు చేస్తున్నట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్ర, శని, ఆదివారాల్లో సుప్రభాత సేవకు విచక్షణ కోటాను రద్దు చేశారు. తద్వారా 20 నిమిషాల సమయం ఆదా అవుతుంది. గురువారం తిరుప్పావడ సేవ ఏకాంతంగా నిర్వహించనున్నారు. తద్వారా 30 నిమిషాల సమయం ఆదా అవుతుంది. శుక్ర, శని, ఆదివారాల్లో వీఐపీ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించరు. స్వయంగా వచ్చే వీఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనం కల్పించడం జరుగుతుంది. తద్వారా ప్రతిరోజు మూడు గంటల సమయం ఆదా అవుతుంది. క్యూలైన్లలో గంటల తరబడి కిలోమీటర్ల మేర వేచి ఉండే వేలాది మంది సామాన్య భక్తులకు ఈ నిర్ణయాల వల్ల త్వరితగతిన స్వామివారి దర్శనం లభిస్తుంది.

24న రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల

తిరుమలలో రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లకు సంబంధించిన జూలై, ఆగస్టు నెలల కోటాను ఈ నెల 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి టీటీడీ వెబ్‌సైట్ https://tirupatibalaji.ap.gov.in లో దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టీటీడీ కోరుతోంది.

శ్రీశైల మహాకుంభాభిషేకం వాయిదా

కార్తీకమాసంలో నిర్వహించాలని నిర్ణయం

సాక్షి, అమరావతి: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన మహాకుంభాభిషేకం కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు దేవదాయ శాఖ కమిషనర్ శ్రీరాము సత్యనారాయణ తెలిపారు. వేసవి వడ గాలుల దృష్ట్యా శ్రీశైల మహాక్షేత్రంలో నిర్వహించవలసిన మహాకుంభాభిషేకం కార్యక్రమాన్ని పండితులతో సంప్రదించిన పిమ్మట, వారి సూచనల మేరకు పవిత్రమైన కార్తీకమాసంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

ఈ మార్పును భక్తులు గమనించాలని సూచించారు. ఈ విషయమై జ్యోతిష్య పండితుల ద్వారా ముహూర్తం నిర్ణయించి త్వరలో తేదీని ప్రకటిస్తామని దేవదాయ శాఖ కమిషనర్ వివరించారు.

ఆందోళనకరంగానే అవినాశ్‌రెడ్డి తల్లి ఆరోగ్యం

కర్నూలు (హాస్పిటల్): కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి మాతృమూర్తి శ్రీలక్ష్మి ఆరోగ్యం ఇంకా విషమంగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం పులివెందులలోని ఇంట్లో ఆమెకు గుండెనొప్పి రావడంతో కళ్లు తిరిగి కిందపడిపోయారు. వెంటనే స్థానిక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు. స్థానిక విశ్వభారతి హాస్పిటల్‌లో ఈసీజీ, 2డీ ఎకో, అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించారు. ఈసీజీలో మార్పులతో పాటు కార్డియాక్ ఎంజైమ్స్ పెరగడం, బీపీలో మార్పులు ఉండటంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. శనివారం సైతం శ్రీలక్ష్మికి ఈసీజీ, 2డీ ఎకో నిర్వహించిన అనంతరం యాంజియోగ్రామ్ పరీక్షలు చేశారు. ఇందులో రెండు వాల్వ్‌లు బ్లాక్ అయినట్టు గుర్తించామని కార్డియాలజిస్ట్ డాక్టర్ హితేష్‌రెడ్డి తెలిపారు. ట్రోపోనిన్ పెరగడంతో గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. అందువల్ల కొన్నిరోజుల పాటు ఐసీయూలోనే చికిత్స అందించాల్సి ఉన్నట్టు చెప్పారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక వైద్యుల బృందం కృషి చేస్తోంది. కాగా, శ్రీలక్ష్మికి అందుతున్న వైద్యసేవలను ఎంపీ అవినాష్‌రెడ్డి దగ్గరుండి చూసుకుంటున్నారు.

ఈనెల 22న విచారణకు హాజరుకండి

ఎంపీ అవినాశ్‌రెడ్డికి సీబీఐ నోటీసులు!

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా ఎంపీ అవినాశ్‌రెడ్డికి సీబీఐ అధికారులు మరోమారు నోటీసులు జారీ చేశారు. ఈనెల 22న కోఠిలోని సీబీఐ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని అవినాశ్‌రెడ్డికి నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. శుక్రవారం సీబీఐ విచారణకు హాజరుకావాలని గతంలో సీబీఐ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే, తన తల్లి శ్రీలక్ష్మి అస్వస్థతకు గురవడంతో దర్యాప్తునకు హాజరుకాలేనని ఎంపీ అవినాశ్‌రెడ్డి తన న్యాయవాదుల ద్వారా సీబీఐ అధికారులకు లిఖిత పూర్వకంగా సమాచారం అందించారు. దీంతో మారోమారు విచారణకు హాజరు కావాలని ఆయనకు నోటీసులు జారీ చేశారు.

జూరాలకు 1,409 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,409 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రాజెక్టులో 7.023 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు చెప్పారు. ప్రాజెక్టు నుంచి 147 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీలను వినియోగించుకోండి

- ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్



స్టేషన్ మహబూబ్‌నగర్: హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణ యువశక్తిని మేల్కొపే దిశగా రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జ్ జాన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అవేజ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ క్విజ్ పోటీల్లో పాల్గొనే వారు జూన్ 1 వరకు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 2న పోటీలు ఉంటాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పోటీలు నిర్వహించి ప్రతి నియోజకవర్గం నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన వారికి వరుసగా ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్, ట్యాబ్‌లతో పాటు 40 కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఒక మహిళకు ఎలక్ట్రిక్ స్కూటీ అందజేస్తామని పేర్కొన్నారు. జిల్లా ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు అవేజ్ మాట్లాడుతూ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో జిల్లాకు చెందిన యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు రిజిస్ట్రేషన్ వెబ్ లింక్‌తో కూడిన ఎస్‌ఎంఎస్ పొందడానికి 7661899899కు మిస్డ్‌కాల్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శులు రమేశ్, శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు అజయ్, ఫహద్, కార్యదర్శులు పురుషోత్తం, ఆమేర్, సోహైల్, అఫ్రోజ్, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు' ఆలస్యానికి కాంగ్రెస్సే కారణం



పాతబజార్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

- ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి

జడ్చర్ల: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల ఆలస్యానికి కాంగ్రెస్‌పార్టీనే కారణమని.. కోర్టులను ఆశ్రయించి పనులు అడ్డుకున్నారని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం బాదేపల్లి కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడైనా ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణాలకు చేపట్టే భూ సేకరణకు ప్రతిపక్షాలు సహకరిస్తాయని.. కానీ ఇక్కడ అలాంటి పరిస్థితి లేదని తెలిపారు. సీఎం కేసీఆర్ మొదట పాలమూరు ప్రాజెక్టుకే ప్రాధాన్యం ఇవ్వగా.. కోర్టులకు వెళ్లిన కారణంగా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని వివరించారు. ఇటీవల జిల్లాలో పర్యటిస్తున్న కాంగ్రెస్ నేతలు పాలమూరు ఎత్తిపోతలను శ్రీశైలం వెనుక జలాల నుంచి కాకుండా జూరాల నుంచి ఎత్తిపోయాల్సి ఉందని చెప్పడం సరికాదన్నారు. జూరాల కేవలం ఆరు టీఎంసీల నిల్వ సామర్థ్యంగల ప్రాజెక్టని.. అక్కడి నుంచి వరద నీటిని ఎక్కువ కాలం ఎత్తిపోసే వీలుండదని, శ్రీశైలం వెనుల జలాల నుంచైతే కావాల్సిన నీటిని ఎత్తిపోసే అవకాశం ఉంటుందన్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్ పనులు 60 శాతం పూర్తయ్యాయని.. ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేస్తామన్నారు. రిజర్వాయర్‌లో రెండు గ్రామాలు, 5 తండాలు ముంపునకు గురవుతున్నాయని, రిజర్వాయర్‌కు 5,500 ఎకరాల భూమిని సేకరించామని తెలిపారు.

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు..

అర్హులందరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తామని ఎమ్మెల్యే డా. సి.లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ విషయమై శనివారం స్థానిక పాతబజార్‌లో ఇల్లిల్లూ తిరిగారు. అనంతరం స్థానిక కమ్యూనిటీ భవనంలో విలేకరులతో మాట్లాడారు. ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా ఉండేందుకు స్వయంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెలలో ఇళ్ల పంపిణీ చేస్తామన్నారు. ఎర్రగుట్టలో 560 ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, అదేవిధంగా హరిజనవాడ, ఫకీర్‌నగర్, పాతబజార్, కావేరమ్మపేట, చర్లపల్లి, బుడగజంగాలకాలనీ తదితర ప్రాంతాల్లో సుమారు రెండు వేల ఇళ్లను పంపిణీ చేస్తామని వివరించారు.

27న మంత్రి హరీశ్‌రావు రాక..

ఈ నెల 27న రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పట్టణంలో నిర్మించిన వంద పడకల ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తారని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. పాతబజార్, నిమ్మబాయిగడ్డలో అర్బన్ హెల్త్‌సెంటర్లను త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో పుర కమిషనర్ లక్ష్మి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, కమిషనర్ షేక్ పాల్గొన్నారు.



దర్శనానికి బారులు తీరిన భక్తులు

బీచుపల్లి.. జనసంద్రం

- జాతరకు పోటెత్తిన భక్తులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం బీచుపల్లి శనివారం భక్తులతో కిక్కిరిసి ఆంజనేయస్వామి నామస్మరణతో మార్మోగింది. నెలరోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మూడో శనివారం కావడంతో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు స్వామివారికి పంచామృత అభిషేకం, ఆకుపూజ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర కృష్ణానదిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో మట్టి కుండల్లో నైవేద్యం తయారుచేసి దాసంగాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాల్లోని దుకాణాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.



కృష్ణానది పుష్కరఘాట్‌లో భక్తులు

తరుగుపై రైతన్నల ఆగ్రహం



రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న రైతులు

గండీడ్: ధాన్యం కొనుగోలులో తరుగు పేరుతో రైతులను మిల్లర్లు దోపిడీ చేస్తున్నారని ఆరోపిస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం మండలంలోని సల్కర్‌పేట్ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. దీంతో మహబూబ్‌నగర్–తాండూరు ప్రధాన రోడ్డుపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు గోపాల్ మాట్లాడుతూ రైతులను తరుగు, తాలు పేరుతో మిల్లర్లు మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం తెలిసినా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఒక బస్తాకు నాలుగు కిలోల తరుగు తీస్తూ నిండా ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐకేపీ కేంద్రాల్లో వడ్లను కాంటా చేసిన తర్వాత కూడా రైతులకు రశీదు ఇవ్వడం లేదని, ఇదెక్కడి అన్యాయమని నిలదీశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు, సర్పంచ్ జితేందర్‌రెడ్డి, చుట్టుపక్కల రైతులు పాల్గొన్నారు.

రైల్వేగేట్ తెరవాల్సిందే..



దేవరకద్రలో ర్యాలీ నిర్వహిస్తున్న పట్టణవాసులు, నాయకులు

- దేవరకద్ర బంద్‌కు పిలుపునిచ్చిన అఖిలపక్ష నాయకులు

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో రైల్వే గేటు మూసి వేయడంతో వ్యాపార కేంద్రాలు మూతపడుతున్నాయి. దీంతో అన్ని పార్టీలకు చెందిన నాయకులతో పాటు వ్యాపారులు, స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. శనివారం మరోసారి పట్టణ బంద్‌కు పిలుపు నిచ్చారు. పట్టణంలోని అన్ని వ్యాపార కేంద్రాలు, హోటళ్లు మూసివేశారు. పట్టణానికి మధ్యలో ఉన్న రైల్వే గేటును స్థానికుల కోసం తెరవాల్సిందేనని మూకుమ్మడిగా అందరూ తీర్మానం చేశారు. పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ ప్రాంతాలలోని వ్యాపార కేంద్రాలన్నీ మూత పడుతున్నాయని ఇప్పటికిప్పుడు పట్టణాన్ని దూరంగా తరలించడానికి వీలుకాదని పలువురు అభిప్రాయపడ్డారు. వాహనదారులు గేటు వద్ద గంటల తరబడి వేచి ఉండడం వల్ల చాలా రోజులు ఇబ్బందులు పడ్డారని, వారి కోసం తప్పనిసరిగా ఆర్వోబీ అవసరమే అయినా స్థానికులు, వ్యాపారులకు గేటు అవసరం కూడా ఉందని పలువురు తెలిపారు. పట్టణ ప్రజల కోసం గేటు తెరవాలని అటు ఇటు రాకపోకలకు అవకాశం ఇవ్వాలని వారు కోరారు. ఆర్వోబీ వల్ల ఆర్టీసీ బస్సులు కూడా బస్టాండ్‌లోకి రావడం లేదని మరీ దారుణంగా ఉందని తెలిపారు. ప్రజలు మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లకు వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

భారీ ర్యాలీ..

పట్టణబంద్‌ను పురస్కరించుకుని నాయకులు, వ్యాపారులు, స్థానికులు భారీ ర్యాలీ నిర్వహించారు. పోచమ్మగుడి వద్ద సమావేశం అనంతరం అక్కడి నుంచి రైల్వే గేట్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం గేటు వద్ద నిరసన తెలిపారు.

ఆర్ఆర్ఆర్ సెంటర్ ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని వార్డు నం.10 రెవెన్యూ కార్యాలయంలో శనివారం రీయూజ్ రీసైకిల్ రూం (ఆర్ఆర్ఆర్)ను మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొందరు దాతలు ముందుకువచ్చి పాత దుస్తులు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, పాత పాఠ్యపుస్తకాలు అందజేశారు. అనంతరం అక్కడికి వచ్చిన పేదలకు వాటిని ఇచ్చారు. ఈ సెంటర్ బాధ్యతలను మహిళా సంఘం సభ్యుల (ఆర్‌పీ)కు అప్పగించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాణి, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, వాణికుమారి, హెల్త్ అసిస్టెంట్ వజ్రలింగం, బీఆర్ఎస్ నాయకుడు రాజు తదితరులు పాల్గొన్నారు. కాగా, త్వరలోనే మిగిలిన 48 వార్డుల్లోనూ ఒక్కొక్కటి చొప్పున ఆర్ఆర్ఆర్ సెంటర్లను ప్రారంభించడానికి చర్యలు చేపడుతున్నారు.



ఆర్ఆర్ఆర్ సెంటర్‌లో పాత దుస్తులు అందజేస్తున్న మహిళ